కథ

పేదోడి కల

— నందివాడ నిర్మల

'ఏమిట్రా రాములూ ఇంకా అక్కడే నిలబడ్డావ్' పొట్ట చేత్తో రాసుకుంటూ అడిగాడు భూకామందు భద్రయ్య.

'అదే బాబూ తవరితో నిన్న చెప్పా కదా' నసిగాడు పాలేరు.

'ఏం చెప్పాలిరా... ఓ అదా.. నా దగ్గర ఇప్పుడు డబ్బుల్లేవురా'

'అలా అనకండి బాబూ మాకు మీరు కాకపోతే ఎవరిస్తారు' ప్రాధేయపడ్డారు.

'రాములూ లేవని ఎన్నిసార్లు చెప్పాలిరా, అయినా నీ పిచ్చి కానీ నీ కొడుకు చదివి ఉద్యోగం చెయ్యాలా, ఊళ్లేలాలా, చివరికి పాలేరు తనమేగా' ఓ వంకర నవ్వు నవ్వాడు.

'ఆడే కదా బాబూ నా ప్రాణం నా ఆశలన్నీ ఆడిమీదే'

'చాలు చాల్లే ఆడ్ని కూడా పనిలోకి తీసుకురమ్మని ఎన్నోసార్లు చెప్పాను. నువ్వా పెద్దాడివయ్యావు. ఇంకెన్నాళ్లు కష్టపడగలవు'

'లేదు బాబూ ఆడు నాలా కష్టపడ్డానికి వీల్లేదు. నా భార్య చనిపోయినకాడ్నించి నా ప్రాణంగా పెంచుకున్నాను. ఆడు స్కూల్లో అందరికంటే బాగా చదువుతున్నాడయ్యా' ఆ మాట అంటున్నప్పుడు రాములు కళ్లల్లో ఆశాకిరణం మెరిసింది.

'సరే ఖచ్చితంగా చెపుతున్నా. నీ కొడుకు విషయంలో నానుంచి పైసా ముట్టదు. ఇక నీవు వెళ్లొచ్చు' కరాఖండిగా చెప్పాడు.

'అది కాదు బాబూ అడ్వాన్సుగా ఇప్పించండి. పండుగకి గుడ్డముక్కలు తియ్యాలి సామీ'

'ఇంకా అడ్వాన్సు ఏముందిరా ఇప్పటికే చాలా వాడేసుకున్నావ్. చేసిన బాకీ తీరక మీ నాన్న తరంనుంచి పాలేరు తనం చేస్తూనే ఉన్నారు. ఇంకా ఎప్పటికి తీరేను నా బాకీ' లాభం లేదన్నట్టుగా లేచి నిలబడ్డాడు.

'నా జీవితం మీ పాదాలముందే ఉంచేగా స్వామీ. నోరు తెరిచి అయ్యా పండగకి కొత్త బట్టలు కొనిపెట్టమని అడిగాడయ్యా, ఒకే ఒక్క లాగూ, చొక్కాతో రోజూ స్కూలు కెళుతున్నాడయ్యా' దాదాపు కాళ్లమీద పడినట్లే ప్రాధేయపడ్డాడు.

'నీ సొదతో నన్ను విసిగించకు. ప్రస్తుతానికి నా దగ్గర డబ్బులేమీ లేవు' చిరాకుగా లేచి లోనికి వెళ్లిపోయాడు.

రాములు తండ్రి హయాంనుంచీ భద్రయ్య దగ్గరే పాలేరుతనం చేస్తున్నాడు. రాములు చదువుకుంటాననలేదు. తండ్రి చదివించలేదు. కానీ తన కొడుకు రంగడు చాలా తెలివైనవాడు. స్కూల్లో అందరి పిల్లల కంటే బాగా చదువుతున్నాడు.

మాస్టారుకూడా అన్నారు వాడికి మంచి భవిష్యత్తు వుంది చదివించమని. ఎట్టి పరిస్థితులలోనూ స్కూలు మాన్పించవద్దని తన అండదండలెప్పుడూ ఉంటాయని మరీ మరీ హామీ ఇచ్చాడు.

ఒకే జతతో రోజూ స్కూలుకు వెళ్లొచ్చి మళ్లీ అదే ఆరేసుకుని కాలక్షేపం చేస్తున్నాడు కొడుకు. రెండు రోజులుగా కొడుకు పట్టుబడుతున్నాడు. ఈ పండక్కి ఏమైనాసరే కొత్త బట్టలు కుట్టించమని.

తను సరేనన్నాడు. యజమానిని రెండు రోజుల్నించి అడుగుతూనే ఉన్నాడు. కానీ భద్రయ్య లేవంటున్నాడు. తనకి తెలుసు ఇవ్వడని. చదువబ్బని భద్రయ్యకి చదువుకునే వాళ్లంటే ఇష్టం ఉండదు. అందులోనూ ఒక పాలేరు కొడుకు చదివి పైకి వస్తాడంటే భద్రయ్య సహించలేకపోతున్నాడు.

మొదట్లో భద్రయ్యకు మాస్టారిమీద కోపం వచ్చింది. రంగడ్ని ప్రోత్సహిస్తున్నందుకు మాస్టారిని హెచ్చరించాడు. నీ జీతం నీకు వస్తుందిగా బుద్ధిగా పెద్దోళ్ల పిల్లలకు చదువు చెప్పలేక కూలి జనాన్ని కూడా చదువుమీద ఉసికొల్పితే కూలీ పన్లేమి కావాలని ప్రశ్నించాడు.

మాస్టారి చిరునవ్వే సమాధానమయ్యింది. సరస్వతి అందరి సొత్తు అన్నారు. లక్ష్మీదేవి మీ ఒక్కరినే కటాక్షించి ఉండొచ్చు. ఎవరూ దోచుకోలేని ఆస్తి ఒక విద్యేనని హితబోధ చేశారు. ఇద్దరి మధ్య వాదోపవాదాలు అయినాయి.

అప్పట్నుంచీ రాములుకు మరీ దినదినగండంగా ఉంది. తాను పస్తులున్నా తన కొడుకుని మంచి ప్రయోజకుడ్ని చేయాలి. అదే తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్నాడు.

ఆలోచిస్తూ నడుస్తున్న రాములు ఇంటిల్లో కొడుక్కి ముఖం ఎలా చూపాలో అర్థం కాలేదు. తిన్నగా మాస్టారి ఇంటికి వెళ్లాడు. ఇంటికి వేలాడుతున్న తాళం వెక్కిరించీ వెనక్కి పంపింది. అప్పుడు గుర్తొచ్చింది శెలవులు ఇచ్చారన్న సంగతి.

తెలుసున్న నాలుగైదు బట్టల దుకాణాలకెళ్లి బట్టలు అప్పు ఇవ్వమని ప్రాధేయపడ్డాడు. వాళ్లు ససేమిరా వీల్లేదన్నారు.

★★★

పుస్తకం ముందేసుకుని చదువుతున్న రంగ వీధిలోకి చూస్తున్నాడు, తండ్రి వస్తున్నాడేమోనని. చాలా సంతోషంగా ఉన్నాడు. తండ్రి కొత్త బట్టలు తెస్తాడు. తను ఎంచక్కా పండక్కి తొడుక్కుంటాడు.

ప్రెసిడెంటు, మున్సబుగారి పిల్లల్లా రోజూ తను స్కూలుకు కొత్త బట్టలేసుకుని వెళతాడు. రోజూ వాళ్లు తనవైపు చూసే హేళన చూపులు తను భరించలేకపోతున్నాడు. అందుకే తండ్రి దగ్గర మారాం చేశాడు.

కడుపులో ఆకలి నకనకలాడుతోంది. ఇంట్లోకి వెళ్లి గిన్నెలో చూశాడు. అంబలి ఉంది కానీ చల్లారిపోయింది. వెచ్చచేసి తాగుదామని కుంపటి మీద పెట్టాడు.

మళ్లీ తండ్రి రాకకై ఎదురుచూస్తూ వీధి గడప వద్ద కూర్చున్నాడు. ఇంకా రావడం లేదు. ఉస్సురంటూ లోనికివచ్చి అంబలి గిన్నెలో పోసుకుని గడగడా తాగేశాడు.

తెలుగు పాఠం చదువుకుంటూ మధ్యమధ్యలో ఆశగా వీధివైపు చూస్తున్నాడు. ఎందుకో తల తిరుగుతున్నట్లు అనిపించింది. కడుపులో వికారంగా ఉండి, ఎవరో చేయిపెట్టి దేవినట్లయింది.

భళ్లున వాంతి చేసుకున్నాడు. తలంతా భారంగా వుంది. ఒళ్లంతా ఎందుకో చల్లబడుతోంది. అప్పటికప్పుడే రెండు మూడు వాంతులయ్యాయి. కళ్లు భారంగా మూతలు పడుతున్నాయి. రంగ మెల్లగా లేచి నులక మంచంపై పడుకున్నాడు. బాధ భరించలేకపోతున్నాడు. మెలికలు తిరుగుతున్నాడు. వాంతుల మూలంగా కాబోలు కడుపులో పేగులన్నీ చెప్పలేని నొప్పిగా ఉన్నాయి.

అయ్యా తొందరగా రా అయ్యా, నాకు కొత్త బట్టలు లేకపోయినా ఫర్వాలేదు. నాకు ఎందుకో భయమేస్తోంది. నా దగ్గర ఉండయ్యా అని మూగగా రోదించాడు.

అలసిపోయి మగతలోకి జారిపోయాడు.

★★★

ఇక తప్పదన్నట్లుగా ఒట్టి చేతుల్తో ఇంటిముఖం పట్టాడు రాములు.

కడుపునిండా అన్నం తిన్న రోజే పేదోళ్లకి పండగని ఆ పసి మనసుకెలా తెలుస్తుంది.

భగవంతుడా అంత తెలివైన కుర్రాడ్ని ఈ పేదోడి కడుపున ఎందుకు పుట్టించావ్. ఏ గొప్పోళ్ల ఇళ్లల్లోనే పుడితే ఆడి కోరికలు తీరేవి గదా.

వాడి కనీసపు కోరిక తీర్చలేని ఈ దౌర్భాగ్యం నాకెందుకు సామీ, నేనేం పాపం చేశాను.

గడపలో అడుగుపెట్టిన రాములు కొడుకు మంచంలో పడుకుని ఉండటం చూసి అలిగి పడుకున్నాడు అని అనుకున్నాడు.

'ఒరే రంగా అంబలి తాగుదాం రారా' అంటూ కాళ్లు కడుక్కోడానికి లోపలికి వెళ్లాడు.

రంగడినుంచి సమాధానం లేదు. కాళ్లు కడుక్కుని మళ్లీ పిలిచాడు. వాడు పలకలేదు.

'రంగా రంగా' అంటూ ఒంటిపై చేయి వేశాడు.

ఒళ్లంతా చల్లగా తడిసిన ముద్దలా ఉంది. ఉలిక్కి పడ్డాడు రాములు. రంగడు మూలుగుతూ నీరసంగా ఏదో కలవరిస్తున్నాడు. 'అయ్య కొత్త బట్టలు తెస్తాడు. పండక్కి కట్టుకుంటాను' అని.

రాములు జుట్టు పీక్కున్నాడు, తన అసహాయతకు. వాడు కలలో కూడా అదే కలవరించడం ఎవరో గుండెను పిండినట్లనిపించింది.

భగవంతుడా వీడికి ఒళ్లంతా చల్లగా ఉందేమిటి పేదోళ్ల దగ్గరేముందని పరీక్షిస్తున్నావ్ సామీ. నిస్సహాయంగా కళ్లు మూసుకుని భగవంతుని ప్రార్థించాడు.

రంగడి పుస్తకాలు లోపల పెడదామని వెళ్లి రంగడు చేసుకున్న వాంతులు చూసి అతడికి గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి. వాంతులు, ఒళ్లంతా చల్లదనం... మనసేదో కీడును శంకిస్తోంది.

మగతగా పడివున్న కొడుకు వంక చూస్తూ క్షణకాలం స్తబ్దుగా వుండిపోయాడు. చేతిలో పైసాలేదు. డబ్బుల్లేకుండా డాక్టరు రాడు. అతడికి మొదటిసారిగా భద్రయ్యమీద, ఆ తర్వాత తన చేతకానితనం మీద కోపం వచ్చింది.

ఆచారినైనా తీసుకువద్దామని బయటికి పరుగుదీశాడు. ఎట్టకేలకు ఆచారివచ్చి రంగడ్ని చూశాడు. వాడి ఒళ్లు మైనం ముద్దలా వుంది. నోటి దగ్గర చిన్న నురగలాంటి మరక కనబడుతోంది.

నాడి చూసిన ఆచారి పెదవి విరిచాడు. ఆహారంలో ఏదో లోపం వుందని, తాను పసరు పోస్తాను బయట పడుకోపెట్టమనీ, తర్వాత భగవంతుని దయ అని చెప్పాడు. ఏవో ఆకులు తీసి పసరు తీయనారంభించాడు.

'ఏరా రాములూ మీవాడు ఈవేళ ఏం తిన్నాడు' పసరు తీస్తూనే అడిగాడు ఆచారి.

'కోడికూతేల అంబలి కాచి కాస్తంత నేను తాగి, ఆడికిచ్చినానయ్యా, మద్దేన్నం పెందరాడే వచ్చేత్తాను. ఇద్దరం తాగుదామని సెప్పేనయ్యా' రాములు గొంతు గద్గదికంగా మారింది.

'మధ్యాహ్నం తాగాడా' తీసిన పసరు గ్లాసులో పోస్తూ అన్నాడు.

'తాగి ఉండడయ్యా. ఎందుకంటే కొత్త బట్టలు తెచ్చేవరకూ తాగనని పొద్దుటే సెప్పినాడయ్యా, అయినా చూసొత్తాను' అంటూ లోపలికి వెళ్లి గిన్నె తీసి చూశాడు.

'బాబూ' అంటూ ఒక్క గావుకేక పెట్టాడు లోపల్నుంచే.

అదిరిపడ్డాడు ఆచారి. పసరు గ్లాసు అక్కడే వదిలేసి ఒక్కంగలో లోపలికి వెళ్లి చూశాడు.

రాములు చేతిలోని గిన్నెలో చచ్చిపోయిన బల్లి ఉంది. ఆచారికి అంతా అర్థం అయింది. రాములు అంబలి కాచి ఇద్దరూ తాగాక గిన్నెమీద మూత మరచిపోయి ఉంటాడు.

పైనున్న బల్లిపడి వేడికి చచ్చి వుంటుంది. అది తెలియని రంగడు దాన్ని కాచి వేడి చేసుకుని తాగి వుంటాడు. దాని ఫలితమే ఇది.

ఆచారి మళ్లీ రంగడి నాడి పరీక్షించాడు. వాడు ఈ లోకంలో తన పనయిపోయినట్లుగా పై లోకానికి వెళ్లిపోయాడు. ఆచారి మౌనంగా వాడికి తెల్లగుడ్డ కప్పాడు.

గుండెలవిసేలా విలపిస్తున్న రాముల్ని ఓదార్చడం ఆచారివల్ల కాలేదు.

'రాములూ నీ కొడుకు చాలా తెలివైనవాడయ్యా, బుద్ధిమంతుడు. అటువంటి వాళ్లని దేవుడు ఈ పాపపు లోకంలో వుంచక తన వద్దకు తీసుకుపోతాడు' రాములు భుజంమీద చేయి వేసి అన్నాడు.

తన భార్య తనని అన్యాయం చేసినా, కొడుకుని చూసుకుని తను బ్రతుకుతున్నాడు. కొడుకు కూడా అన్యాయం చేసి వెళ్లిపోతే తను బ్రతికేది ఎవరి కోసం. ఇది జవాబు దొరకని ప్రశ్న.

అతని గాజు కళ్లనుంచి రెండు కన్నీటి బిందువులు నేలమీద రాలి ఇంకిపోయినయ్.

అతనికి ఓదార్పుగా క్షణకాలం మౌనం పాటిద్దామనుకున్న గుండె చప్పుడు, అనుకున్న మాట మరచి మళ్లీ పనిచేయనని మొరాయించి శాశ్వతంగా నిశ్శబ్దంగా ఉండిపోయింది.